
సాక్షి
నారాయణపేట
సోమవారం, 17, జూన్, 2024



'అమృత్ 2.0'కు శ్రీకారం

జడ్చర్లకు మంజూరైన అమృత్ 2.0 స్కీం పనులకు టెండర్లు పూర్తయ్యాయి.

వివరాలు 8లో ▸



పోరాటం ఫలించేనా!

ఇళ్ల స్థలాలు చూపాలని 15 ఏళ్లుగా వరద బాధితులు పోరాటం సాగిస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /21.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపికలు

నారాయణపేట: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శక్తి వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయి, 29న జిల్లాస్థాయి, జూలై 11, 12 తేదీలలో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. 4వ తరగతి చదువుతున్న 20 మంది బాలురు, 20 మంది బాలికలు పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. 4వ తరగతి బాలబాలికలు 2017 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఆధార్, బోనాఫైడ్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, పుట్టిన తేదీ, కుల ధ్రువపత్రం, ఐదు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు 10 నెలల ఉచిత శిక్షణకు గాను ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి వంద మందిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారన్నారు. అభ్యర్థులు జనరల్/ ప్రొఫెషనల్ డిగ్రీలో ఉత్తీర్ణులై, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించని వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు http://tgstudycircle.co.in వెబ్‌సైట్‌లో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 10 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 21న హైదరాబాద్‌లో ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.040-23546552, సెల్ నం.98859 29862, 89773 40006 సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి కూలి రూ.800 చెల్లించాలి'



ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు రూ.800 కూలి చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర నాయకుడు హన్మంతు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తోందని.. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. పనికి వచ్చే ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, కూలీల సమగ్ర చట్టం తీసుకురావాలని, ఏడాదికి 200 పని రోజులు కల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా స్టీఫెన్, ఉపాధ్యక్షుడిగా మాసన్న, కార్యదర్శులుగా రాజు, సాయి, కుర్మన్న, సత్యనారాయణ, పుల్లన్న రాములు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఒక్కరా.. ఇద్దరా.. ముగ్గురా!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ గద్వాల రూరల్:

నడిగడ్డ రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకోనున్నాయా.. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పార్టీని వీడి హస్తం గూటికి చేరనున్నారా.. అంటే వారం రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం ఇందుకు ఊతమిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉమ్మడి పాలమూరు బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా మారిన విషయం తెలిసిందే. అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలో పెద్ద పార్టీగా అవతరించడంతోపాటు రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఆ తర్వాత జిల్లా రాజకీయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను పూర్తిస్థాయిలో ఖాళీ చేసేలా పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ అధిష్టానం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ కీలక నేతల చేరికలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా జోగుళాంబ గద్వాలపై దృష్టిసారించిన నేపథ్యంలో గులాబీని వీడేది ఒక్కరా.. ఇద్దరా.. ముగ్గురా..? ఎవరా నేతలు అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పూర్తిగా ఖాళీ చేయించేలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. గత ఎన్నికల్లో 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్‌లో మాత్రమే బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరులో గులాబీ పార్టీని పూర్తిగా ఖాళీ చేయించాలనే ఎత్తుగడతో కాంగ్రెస్ దూకుడు పెంచినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ మంత్రితోపాటు

మరో మంత్రికి నడిగడ్డ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఈ మేరకు ఒక మంత్రి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మరో మంత్రి అలంపూర్‌కు చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడితో చర్చలు జరిపినట్లు తెలిసింది. కర్నూలు వేదికగా వేర్వేరుగా జరిపిన మంతనాలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి.

బీఆర్‌ఎస్ కీలక నేతలకు కాంగ్రెస్ గాలం

- గద్వాల జిల్లా టార్గెట్‌గా ఫోకస్
- ఎమ్మెల్యే బండ్లతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి మంతనాలు
- ఎమ్మెల్సీ చల్లా, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో మరో మంత్రి సంప్రదింపులు
- నడిగడ్డలో పాతకాపులకు చెక్ పెట్టేందుకేనా..
- నెలాఖరు నాటికి హస్తం గూటికి కృష్ణమోహన్‌రెడ్డి?



ఈ నెలాఖరు నాటికి..

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో మంత్రి నెరిపిన సంప్రదింపులు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నాటికి ఆయన హస్తం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నడిగడ్డలో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందినా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పరిపాలన పరమైన సమస్యలతోపాటు తాను నమ్ముకున్న వర్గానికి, ప్రజలకు న్యాయం చేసేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని బండ్ల భావిస్తున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. నడిగడ్డలో కాంగ్రెస్‌కు చెందిన పాతకాపులకే ప్రభుత్వ పరమైన పరిపాలనలో ప్రాధాన్యత లభిస్తుండటం.. తాము ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనా తగిన ప్రాధాన్యత లేకపోవడంతో పార్టీ మారాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అలంపూర్‌కు సంబంధించి చల్లా, విజయుడు ఇప్పటి వరకు పార్టీ మార్పుపై స్పందించలేదు. కానీ, బండ్లతోపాటు చల్లా తమ తమ అనుచరులు, పార్టీ నాయకులతో సంప్రదింపులు చేస్తూ అభిప్రాయాలను తీసుకుంటున్నట్లు సమాచారం.

సంప్రదించిన మాట వాస్తవమే..

కాంగ్రెస్‌లో చేరుతున్నారనే ప్రచారంపై గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. 'నన్ను కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకులు పార్టీలోకి ఆహ్వానిస్తూ సంప్రదించిన మాట వాస్తవమే.. ఈ మేరకు ఒత్తిళ్లు కూడా వస్తున్నాయి. పార్టీ మారడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.' అని తెలిపారు.

ఎవరికి చెక్..?



చల్లా వెంకట్రామిరెడ్డి   విజయుడు

కాంగ్రెస్‌లోకి గులాబీ ముఖ్య నేతల చేరికల వెనక పెద్ద స్కెచ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇటు గద్వాల, అటు అలంపూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకుల వ్యవహారశైలి ఇబ్బందులు తెచ్చి పెడుతుండడంతోపాటు అధిష్టానానికి తలనొప్పిగా మారారని.. వారికి చెక్ పెట్టేందుకే చేరికలకు శ్రీకారం చుట్టినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్లకు మధ్య విబేధాలు ఉన్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆయన చేతిలోనే ఆమె ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం ఆమె వర్గీయులను నిద్ర లేకుండా చేస్తున్నట్లు ప్రచారం. సరిత మాత్రం 'ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్న విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదు.' అని చెబుతున్నారు. 'ఆయన చేరికపై పార్టీకి చెందిన మంత్రి జూపల్లి, ఇతర ముఖ్య నాయకులు ఎవరూ చర్చించలేదు. అవన్నీ ప్రచారం మాత్రమే. అయితే పార్టీ అవసరాల దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారిని పార్టీలోకి తీసుకుంటే.. ఎలాంటి అభ్యంతరం లేదు. మేం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేశాం. మాకు రేవంత్‌రెడ్డిపై పూర్తి నమ్మకం ఉంది. మాకు పార్టీలో ఎలాంటి అన్యాయం జరగదని అనుకుంటున్నాం. పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం..' అని తెలిపారు.

తొలగిన సంగంబండ

తుది దశకు చేరిన లోలెవల్ లెఫ్ట్ కెనాల్ పనులు



సంగంబండ రిజర్వాయర్ వద్ద తొలగించిన బండ

- వానాకాలం పంటలకు సాగునీరు అందించేందుకు సన్నాహాలు
- సస్యశ్యామలం కానున్న 25వేల ఎకరాలు
- 15 ఏళ్ల సమస్యకు పరిష్కారం
- ఆనందంలో అన్నదాతలు

మక్తల్: భీమా ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన సంగంబండ రిజర్వాయర్ లోలెవల్ లెఫ్ట్ కెనాల్ నిర్మాణం తుది దశకు చేరింది. రిజర్వాయర్ వద్ద కాల్వ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న బండను పూర్తిగా తొలగించారు. వానాకాలం పంటలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అధికారులు కాల్వ పనులను వేగవంతం చేశారు. లెఫ్ట్ కెనాల్ నిర్మాణంతో 25వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

15 ఏళ్లుగా ఎదురుచూపులు..

సంగంబండ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తర్వాతే రిజర్వాయర్ వద్ద బండ తొలగించాలని డిమాండ్ చేస్తూ, పనులను అడ్డుకున్నారు. దీంతో మక్తల్ మండలంలోని దాసర్‌దొడ్డి, తిర్మలాపూర్, గుర్లపల్లి వనాయికుంట, చందాపూర్, మాగనూర్ మండలంలోని వడ్వాట్, వర్కూర్, మాగనూర్, ఓబులాపూర్, పెకడబండ, అమ్మపల్లి తదితర గ్రామాలకు సాగునీరందించే లోలెవల్ లెఫ్ట్ కెనాల్ నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. 15 ఏళ్లుగా ఆయకట్టు రైతులకు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు.



సంగంబండ రిజర్వాయర్ లోలెవల్ లెఫ్ట్ కెనాల్

నిర్వాసితులకు రూ. 12 కోట్లు మంజూరు..

సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులు, ఆయకట్టు రైతుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నిర్వాసితులకు రూ. 12 కోట్లు మంజూరు చేయడంతో పాటు లోలెవల్ లెఫ్ట్ కెనాల్ నిర్మాణం ప్రారంభించింది. కాల్వ పనుల పూర్తిపై స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. సంగంబండ నుంచి వడ్వాట్ గ్రామం వరకు చేపట్టిన కాల్వ పనులను వేగవంతం చేశారు. కాల్వ నిర్మాణం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న రైతాంగం కల త్వరలోనే సాకారం కాబోతోంది.

ఆనందంగా ఉంది..



సంగంబండ రిజర్వాయర్ కాల్వ నిర్మాణం నిలిచిపోవడంతో నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారం రాలేదు. ఓవైపు నిర్వాసితులు, మరోవైపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం అందించడం, కాల్వ పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉంది.

– లక్ష్మారెడ్డి, సంగంబండ

సాగునీటి కష్టాలు తీరుతాయి..



15 ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నాం. సంగంబండ రిజర్వాయర్ వద్ద కాల్వ నిర్మాణం నిలిచిపోవడంతో అవస్థలు పడ్డాం. ఎట్టకేలకు కాల్వ నిర్మాణం పూర్తి కావడంతో సాగునీళ్లు వస్తాయన్న నమ్మకం ఏర్పడింది. వానాకాలం పంటలకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే చెప్పడం సంతోషంగా ఉంది.

– రవీందర్, వడ్వాట్, మాగనూర్ మండలం

18 రోజుల్లో సమస్య పరిష్కారం..



సంగంబండ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి 15 ఏళ్లు అవుతోంది. ఇప్పటికీ కొన్ని గ్రామాల రైతులకు సాగునీరు అందడం లేదు. రైతుల బాధ తీర్చేందుకు నా వంతు కృషిచేశా. మక్తల్ ఎమ్మెల్యేగా గెలిచిన 18 రోజుల్లోనే సంగంబండ రిజర్వాయర్ నిర్వాసితులు, ఆయకట్టు రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. నిర్వాసితులకు న్యాయమైన పరిహారం మంజూరు చేయించడంతో పాటు 9 గ్రామాలకు సాగునీరు అందించే కాల్వ పనులను పూర్తి చేయిస్తున్నా. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నుంచి రైతాంగానికి పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు కృషిచేస్తా.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లా కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా హన్మకొండ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిక్తా పట్నాయక్ నారాయణపేటకు బదిలీపై వచ్చిన విషయం విదితమే. కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఓ నర్సింగరావు, డీపీఆర్‌ఓ ఎంఏ రషీద్, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది, అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు.

నేడు బక్రీద్ పండుగ



మహబూబ్‌నగర్‌లో పొట్టేళ్లు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

- ఈద్గాలు, మసీదుల్లో నమాజుకు ఏర్పాట్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం చివరి మాసమైన జిల్‌హిజ్జా 10వ తేదీన జరుపుకొనే ఈ పండుగను 'ఈద్-ఉల్-జుహా'గా వ్యవహరిస్తారు. సామూహికంగా ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజు చేస్తారు. సర్వమానవ కల్యాణం కోసం నమాజు చేసి ప్రార్థనలు జరిపిస్తారు. జిల్లాకేంద్రంలోని పాత పాలమూరు (రియాజుల్ జన్నా మసీదు) నుంచి ఉదయం 7.30 గంటలకు ముస్లింలు సామూహికంగా జామియా మసీదు, గడియారం చౌరస్తా మీదుగా స్థానిక రహెమానియ ఈద్గా వద్దకు చేరుకొని 8.30 గంటలకు ప్రత్యేక ఈద్ నమాజ్ చేస్తారు. అలాగే పట్టణంలోని పలు మసీదుల్లోనూ బక్రీద్ ప్రత్యేక ఈద్ నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు.

మూడు రోజులపాటు కొనుగోళ్లు

బక్రీద్ పండుగలో ఖుర్బానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజులపాటు పొట్టేళ్ల మాంసాన్ని పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో నాలుగు రోజుల నుంచే పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకోగా.. మరో రెండు రోజులపాటు జరగనున్నాయి. జిల్లాకేంద్రంలోని కాస్మిక్ బేకరి ఎదుట, న్యూటౌన్, వన్‌టౌన్, క్లాక్‌టవర్, మార్కెట్, మదీనా మజీద్, షాసాబ్ గుట్ట, రాయిచూర్ రోడ్ తదితర ప్రాంతాల్లో పొట్టేళ్ల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు అమ్ముతున్నారు.

ప్రశాంతంగా పండగ నిర్వహించుకోవాలి..

నారాయణపేట: జిల్లా ప్రజలు బక్రీద్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకొని మతసామరస్యాన్ని చాటాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బక్రీద్ పండగ సందర్భంగా పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, భద్రతా పరమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఈద్గాల వద్ద ప్రార్థనల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలంతా మతసామరస్యాన్ని కాపాడుకుంటూ శాంతియుత వాతావరణంలో పండగలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేశారు. సోషల్ మీడియాపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచామని.. ఎవరైనా వివాదాస్పదమైన పోస్టులు చేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.



మక్తల్ ఈద్గా వద్ద తనిఖీలు చేస్తున్న బాంబుస్క్వాడ్ బృందం

విస్తృతంగా తనిఖీలు..

బక్రీద్ పండగ సందర్భంగా నారాయణపేట, మక్తల్, ఊట్కూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఈద్గాలు, ప్రార్థనా మందిరాలు, ప్రధాన చౌరస్తాలలో ఆదివారం బాంబుస్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఉద్యోగాల కల్పనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కళాశాలలో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ శివారులోని పీవీ నరసింహారావు తెలంగాణ మత్స్య విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, ఉపాధి అవకాశాల గురించి ఆరా తీశారు. యూనివర్సిటీ వెనక డంపింగ్‌యార్డు ఉండటంతో దుర్వాసన వస్తోందని తెలుపగా వెంటనే పుర కమిషనర్‌తో మాట్లాడి వేరే ప్రాంతానికి మార్చాలని సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొని బుచ్చారెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసరాజు భాస్కర్, పాతపల్లి చంద్రశేఖర్, విజయ్‌గౌడ్, సురేష్, నరసింహ, చరణ్, సోప్పరి రమేష్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో దుర్భర పరిస్థితులు

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. విద్యార్థులు అనేక సమస్యలతో సతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని వచ్చే నెల 6 నుంచి దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 2016 కంటే ముందు మెస్ చార్జీలు అమలు చేస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం, ఉప్పు, పప్పు, గుడ్లు, కూరగాయల ధరలు పెరగడం, వాటిపై జీఎస్టీ విధించడంతో ధరలు ఆకాశానికి అంటాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని కోరారు. అలాగే కాస్మోటిక్ చార్జీలు 40 ఏళ్ల నుంచి బాలికలకు రూ.75, బాలురకు రూ. 62 ఇస్తున్నారని ఆరోపించారు. సబ్బులు, నూనె ధరలు పెరిగినందున కాస్మోటిక్ చార్జీలు రూ.200లకు పెంచాలన్నారు. అలాగే విద్యార్థులకు ఇస్తున్న పెట్టెలు, గ్లాసులు, బూట్లు, దుప్పట్లు, ఇతర సామగ్రి ఏడాది నుంచి రావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే టెండర్లు నిర్వహించి హాస్టల్ విద్యార్థులకు సామగ్రి సరఫరా చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మాణిక్యంరాజు, లక్ష్మీదేవి, నాయకులు వెంకట్రాములు, బాలరాజు, ఆది విష్ణువర్ధన్, సత్యం, రాములు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


జాలగిరి సురేంద్ర(ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్ వెళ్తున్న ఇద్దరు యువకులు ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న ఇనుప రేలింగ్‌ను ఢీకొట్టాడు. దీంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున కొత్తకోట మండలం నాటవెల్లి ఎన్‌హెచ్ 44పై చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా, డోన్ మండలం, తాటిమాను కొత్తూరుకి చెందిన జాలగిరి మల్లేష్ కుటుంబంతో కలిసి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని గౌలిపురంలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అతనికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జాలగిరి సురేంద్ర(22) ఉన్నాడు. జాలగిరి సురేంద్ర, ఎరుకలి సురేష్ బంధువులు. వీరు డ్రైవర్లుగా పనిచేస్తుండేవారు. ఎరుకలి సురేష్ స్వస్థలం కర్నూల్ జిల్లా, ఆదోనీ మండలం, ముత్కూర్ వాసి. కాగా.. స్వగ్రామంలో భార్య ఇటీవలే కాన్పు కావడంతో బాబును చూసేందుకు వెళ్లాలనుకున్నాడు. జాలగిరి సురేంద్ర ఫైనాన్స్‌లో బైక్ తీసుకున్నాడు. ఫైనాన్స్ క్లియరెన్స్ పత్రాలు తీసుకొచ్చుకునేందుకు ఇద్దరు కలిసి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి సురేష్ బైక్‌పై ఇద్దరు బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెల్లి ఎన్‌హెచ్ 44 ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా బైక్‌కు ఎడమవైపునకు వచ్చింది. బైక్ నడుపుతున్న జాలగిరి సురేంద్ర బైక్‌ను అదుపుచేసే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న ఇనుప రేలింగ్‌కు బలంగా ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరి కింద పడటంతో జాలగిరి సురేంద్రకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి జాలగిరి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

యువకుడి బలవన్మరణం


మల్లేష్ (ఫైల్)

మిడ్జిల్: మండలంలోని రాణిపేట్‌లో చెట్టుకు ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఉర్కొండ మండలంలోని మాదారం చెందిన కుమ్మరి మల్లేష్(32) ఏడేళ్ల క్రితం మండలంలోని రాణిపేట్‌కు వచ్చి బంధువుల అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. గ్రామంలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈయన మండల కేంద్రంలోనే పెట్రోల్ బంక్‌లో చేస్తూ శనివారం ఉదయం పని పూర్తయ్యాక ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత, ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


జడ్చర్ల: జడ్చర్ల–గంగాపూర్ ప్రధాన రహదారిపై పత్తి మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు దాటుతున్న మహిళను ఓ కారు అతి వేగంగా ఢీకొట్టడంతో మృత్యువాత పడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మిడ్జిల్ మండలం లింబ్యతండాకు చెందిన కేతావత్ జెమ్ర(36) కేతావత్ సోనాలి అక్కాచెల్లెల్లు. వీరు శనివారం పత్తి మార్కెట్ వద్ద ఉన్న హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా గంగాపూర్ వైపు నుంచి జడ్చర్లకు వెళ్తున్న ఓ కారు అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కేతావత్ జెమ్ర తీవ్రంగా గాయపడింది. వైద్య చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటికొండకి చెందిన నాగన్న(50) శనివారం రాత్రి 10:30 గంటలకు పని నిమిత్తం భూత్పూర్‌కు వెళ్తున్నానని భార్య వెంకటమ్మకు చెప్పి ఏపీ 22 ఏఎఫ్ 9013 నంబరు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై బయలుదేరాడు. జాతీయ రహదారిపై పోతులమడుగు వద్దకు రాగానే కొత్తకోట నుంచి భూత్పూర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో నాగన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఆదే రోజు రాత్రి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం నాగన్న భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

‘అమృత్ 2.0’కు శ్రీకారం

- పూర్తయిన టెండర్లు
- తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.47కోట్లు మంజూరు


జడ్చర్ల పట్టణ వ్యూ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో నీటి సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.47కోట్లకు సంబంధించిన పనులకు టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. ఈ పథకం ద్వారా మున్సిపాలిటీలో నీటి సమస్య పూర్తిగా పరిష్కారం కావటంతోపాటు మరో 20ఏళ్ల వరకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాను ఇచ్చి తాగునీటిని అందించాలని గత ప్రభుత్వం పథకాన్ని రూపుదిద్దింది. అధికారుల అలసత్వంతో సరైన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవటం వల్ల అక్కడక్కడా సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. దానికి తోడు మిషన్‌భగీరథ పనుల కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట, జడ్చర్ల, బూరెడ్డిపల్లి, నాగసాల, నక్కలబండతండా, శంకరాయపల్లితండా, బాదేపల్లిలో నీటి సమస్య ఉత్పన్నం అవుతూనే ఉంది. దీనికి తోడు కొత్త కాలనీలు, వెంచర్లు ఏర్పడటం వల్ల ఆ కాలనీలకు నీరు అందకపోవటం సమస్యలుగా పరిణమిస్తున్నాయి. మున్సిపాలిటీలో 1.20లక్షలకు పైగా జనాభా ఉండగా 18వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. ప్రస్తుతం 9వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణంలో ప్రస్తుతం 20 ట్యాంకులు ఉండగా 200కి.మీ. మేర పైపులైన్ ఉంది.

ఇవీ ప్రతిపాదనలు

ఈ పథకం ద్వారా మంజూరైన నిధులతో మున్సిపాలిటీలో 53 లక్షల లీటర్ల నీటి నిల్వ సామార్థ్యం గల 7 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 30వేల లీటర్ల సామార్థ్యం గల ఒక సంపు నిర్మించనున్నారు. వీటిలో సిగ్నల్‌గడ్డ వద్ద 15లక్షల సామార్థ్యం కల పెద్ద ట్యాంక్ నిర్మించనున్నారు. అదేవిధంగా బూరెడ్డిపల్లి, నేషనల్‌ధాబా సమీపంలో, క్లబ్ రోడ్, వంశీ ఆస్పత్రి వెనకాల, ఎర్రగుట్టలలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు. 6.2 కిలోమీటర్ల మేర ఫీడర్ పైపులైన్ వేయనున్నారు. ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు 62.5 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయనున్నారు. అదేవిధంగా 7,954 నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు. వీటితో పాటు జర్నలిస్ట్ కాలనీ, కొత్త కాలనీలకు పైపులైన్‌లు వేయాల్సి ఉంది. వీటికి టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. ఎన్నికల కోడ్ కారణంగా ఇన్నాళ్లు పనులు ప్రారంభించటానికి జాప్యం కలిగింది.

త్వరలోనే పనులు

అమృత్ 2.0 పథకానికి సంబంధించి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. పనులకు టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. పథకంలో 7ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపు నిర్మాణం చేయాల్సి ఉంది. 7,954 కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మున్సిపాలిటీ పరిధిలో పాత స్కీంలలో లేని కాలనీలు, ఇళ్లకు నీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– భాస్కర్, ఏఈ, మున్సిపాలిటీ, జడ్చర్ల

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి


పట్టుబడిన మోటారు సైకిళ్లతో కోడిపందెం రాయుళ్లు

15 మోటార్ సైకిళ్లు, 7 సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం

ఖిల్లాఘనపురం: కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా కోడిపందెం స్థావరం నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన ఖిల్లాఘనపురం మండలం మానాజీపేట గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గార్లబండ తండాకు చెందిన మాన్యానాయక్ ఆధ్వర్యంలో ఖిల్లా ఘనపురం మండలం మానాజీపేట గ్రామ శివారులో ఆదివారం కోడిపందాలు నిర్వహించారు. పక్కా సమాచారంతో ఎస్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో దాడి చేశారు. దీంతో మాన్యానాయక్, చిన్నమందడికి చెందిన బాల్‌రాజు, మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీనువాసులు, కనిమెట్టకి చెందిన రాజశేఖర్, శ్రీరంగాపురానికి చెందిన సత్యనారాయణ, మదనాపురానికి చెందిన విష్ణు, జడ్చర్లకు చెందిన రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరికొందరు పరారయ్యారు. ఈ దాడిలో 15 మోటారు సైకిళ్లు, 7 సెల్ ఫోన్లు, 11 పందెం కోళ్లతోపాటు రూ.10,730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు, అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

నీటిగుంతలో పడి రెండేళ్ల బాలుడి మృతి


జశ్వంత్(ఫైల్)

రాజాపూర్: కళ్ల ముందే ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు ఇంటి పక్కన ఉన్న నీటిగుంతలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన శివ, లావణ్యకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు జశ్వంత్ (2) ఉన్నారు. అందరిలాగే ఇంటిముందు ఆడుకుంటుండగా సాయంత్రం ఇంటి పక్కన డ్రెయినేజీ రోడ్డుపైకి పారుతుండటంతో పంచాయతీ సిబ్బంది మురుగు రోడ్డుపైకి రాకుండా చిన్న గుంతను తీశారు. దీంతో ఆడుకుంటు వెళ్లిన జశ్వంత్ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కుటుంబసభ్యులు బాలుడు కనిపించకపోవడంతో ఇంటి పరిసరాలు వెతికిన కనిపించకపోవడంతో పక్కనే ఉన్న నీటిగుంతలో చూశారు. బాలుడు గుంతలో పడి ఉండటంతో వెంటనే జడ్చర్ల ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కొన్ని నెలలుగా డ్రెయినేజీ పైపు పగిలి మురుగు రోడ్డుపై పారుతుండటంతో పంచాయతీ మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ఆ గుంత బాలుడి మృతికి కారణమైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం


చెంచు విద్యార్థి ఉరి వేసుకున్న స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలోని లింగాల మండలం రాంపూర్ పెంట సమీపంలో ఈనెల 11న చిగుర్ల రాముడు అనే చెంచు విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడటంతో మృతుడి తల్లి చిగుర్ల లింగమ్మ 15వ తేదీన లింగాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఘటనా స్థలాన్ని ఆదివారం తహసీల్దార్ ఉమ, ఎస్‌ఐ జగన్మోహన్, ఆర్‌ఐ సీతారాంనాయక్, వైద్యాధికారి సాయితరుణ్ పరిశీలించారు. ఖననం చేసిన మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో వెలికితీసి, వైద్యాధికారి సాయితరుణ్‌చే పోస్టుమార్టం నిర్వహించారు.

కోనేరులో మునిగి వ్యక్తి..


మహేష్ (ఫైల్)

శాంతినగర్: పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లిన ఓ వ్యక్తి కోనేరులో మునిగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వడ్డేపల్లికి చెందిన కురువ మహేష్ (34) కుటుంబసభ్యులతో కలిసి బేతంచెర్ల సమీపంలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటిస్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో కోనేరులో స్నానమాచరించడానికి దిగాడు. ఈతకొడుతూ ప్రమాదవశాత్తు గుంతలో మునిగిపోయాడు. కుటుంబసభ్యులు వెతికినా మహేష్ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం మృతదేహం కోనేరులో తేలడంతో బయటకు తీశారు. దైవ దర్శనానికి వెళ్లి అనంతలోకాలకు చేరుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు వున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ


చిన్నపొర్ల శివారులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల శివారులో రెండు రోజుల క్రితం దాయాదుల దాడిలో గువ్వల సంజీవ్ అనే వ్యక్తి హత్యకు గురైన విషయం విదితమే. ఘటనా స్థలాన్ని ఆదివారం మక్తల్ సీఐ చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో విచారణ చేపట్టారు. పికెటింగ్ ఏర్పాటుచేసిన పోలీసులకు పలు సూచనలు చేశారు. సీఐ వెంట మక్తల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి, ఎస్‌బీ కానిస్టేబుల్ చెన్నయ్య ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలే వాడాలి



పేపర్ టవల్ ద్వారా మొలక శాతం పరీక్ష , మొక్క శాతంలో పరీక్షించిన విత్తనాలు

అలంపూర్: విత్తనం బాగుంటే మొలక బాగా వస్తోంది. మొలకలు బాగా వస్తే మొక్కలు బాగా పెరుగుతాయి. అందుకే విత్తు కోసం నాణ్యమైన గింజలను ఎంపిక చేసుకోవాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను క్రమ పద్ధతిలో కడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వివరించారు. విత్తనాలను మొలక కట్టి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. విత్తనాలను లెక్కించే విధానాల గురించి రైతులకు వివరించారు.

విత్తన ఎంపిక

పంట సాగులో అనుకూలమైన, ఆరోగ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోంటే రైతులకు అన్ని విధాల శ్రేయస్కరం. విత్తన నాణ్యత ప్రమాణాలను మొలక శాతం ఆధారంగా నిర్ధారిస్తారు. అందుకు తెలుగు రాష్ట్రాల్లో విత్తన పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలోని హైదరాబాద్ రాజేంద్రనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని తాడెపల్లి గూడెం, ఎమ్మిగనూరులో విత్తన పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి విత్తనాలను ఎంపిక చేస్తారు. ఆ విత్తనాలను ప్రభుత్వం, ప్రైవేట్ కంపెనీలు నిర్ధారించి రైతులకు సరఫరా చేస్తారు. రైతులు తాము పండించిన పంట నుంచి కూడా విత్తనాలు తయారు చేసుకోవచ్చు. విత్తనాలను మొలక కట్టి వాటి నాణ్యత ప్రమాణాలను బట్టి ఎంపిక చేసుకోవచ్చు. రైతులు నాలుగు పద్ధతుల్లో తెలుసుకోవచ్చు. రైతు స్థాయిలో విత్తన మొలక శాతాన్ని తెలుసుకోనే పద్ధతులు ఉన్నాయి.

పేపర్ టవల్ పద్ధతి

పేపర్ టవల్ లేదా మండపాటి దుస్తువును తీసుకుని బాగా తడిపి గచ్చు నేలపై పరిచి 100 గింజలను వరుసలో అమర్చాలి. దీనిపై మరో తడి పేపర్ టవల్‌ను పరిచి రెండింటిని కలిపి చాపలా చుట్టాలి. చివర్లో దారంతో చుట్టి ఏదైన పాత్రలో ఏటవాలుగా పెట్టాలి. అప్పుడప్పుడు నీటితో తడుపుతూ ఉండాలి. ఈ పద్ధతి ద్వార వరి, జొన్న, పొద్దుతిరుగుడు విత్తనాలను పరీక్షించుకోవచ్చు.

ట్రే పద్ధతి

లావు గింజ రకాలైన పత్తి, వేరు శనగ, ఆముదం ఇసుక పోసిన ప్లాస్టిక్ ట్రేలో వేయాలి. 100 విత్తనాలను అంగుళం లోతు ఇసుకలో విత్తుకోవాలి. తేమ ఉండేటట్లు నీళ్లు చల్లుతూ ఉండాలి.

పెట్రి డిష్ పద్ధతి

వంగ, టమాట, మిరప వంటి చిన్న విత్తనం మొలకలను పరీక్షించుకోవచ్చు. పెట్రిడిష్‌లో బ్లాటింగ్ పేపరును అమర్చి నీటితో తడపాలి.

గుడ్డమూట పద్ధతి

మొలక కట్టాల్సిన 100 విత్తనాలను గుడ్డలో మూత కట్టి దీనిని చిన్న ప్లేటులో పెట్టి అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. ఈ పద్ధతి ద్వారా 5 నుంచి 10 రోజుల్లో మొలక శాతాన్ని తెలుసుకోవచ్చు.

మొలక శాతం

- సామాన్యంగా పరీక్షకు తీసిన శాంపిల్ గింజల్లో నూటికి 99 శాతం మంచి గింజలు ఉండాలి.
- మొక్కజొన్నకు 90 శాతం మొలకలు రావాలి.
- ఇతర ధాన్యాలకు 75 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- పప్పు దినుసులకు 75 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- నూనె గింజలకు 70 నుంచి 80 శాతం మొలకలు రావాలి.
- పత్తి, బెండ విత్తనాలకు 65 శాతం మొలకలు రావాలి.

పోరాటం ఫలించేనా!


అలంపూర్‌లో వరద బాధితుల కోసం సిద్ధం చేసిన ప్లాట్లు

వరద బాధితులకు అందని ఇళ్ల స్థలాలు

- 15 ఏళ్లుగా నిర్వాసితుల నిరీక్షణ
- పునరావాసానికై 2011లో 43.27 ఎకరాలు సేకరణ
- జాబితాలో మా పేర్లు లేవని 670 మంది దరఖాస్తు

అలంపూర్: ఎన్నికలు వచ్చాయంటే వరద బాధితుల సమస్య ముందుకు వస్తోంది. ఎన్నికల ముందు వరద బాధితులకు ఇళ్ల పట్టాలిస్తామని అధికార యంత్రాంగం హడావుడి చేస్తోంది. తీరా అధికార పగ్గాలు చేపట్టాక వరద బాధితుల సమస్య కొలిక్కి వస్తుందని నిర్వాసితులు ఆశగా ఎదురు చూడటం పరిపాటిగా మారింది. పదిహేనేళ్లుగా కాలం వెల్లదీశారు. పట్టాలిచ్చిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు చూపడం లేదు. ఇళ్లు నిర్మించి ఇస్తామని పునాదులు వేసిన చోట పనుల్లో కదలిక లేకుండాపోతుంది. ఇది 2009లో కృష్ణా- తుంగభద్ర నదులు ఉప్పొంగడంతో నిరాశ్రయులుగా మిగిలిన నిర్వాసితుల పరిస్థితి.

బీభత్సం సృష్టించిన జీవ నదులు

నడిగడ్డ అంటేనే నదులు చుట్టూ ఉన్న గడ్డగా పేరు గాంచింది. చుట్టూ ఉన్న జీవనదులు ఒక్కసారిగా బీభత్సం సృష్టించాయి. 2009 అక్టోబర్ 2న కృష్ణ, తుంగభద్ర నదుల ఉప్పొంగి జిల్లాలోని నదీతీర గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. అలంపూర్ నియోజకవర్గంలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. 32 గ్రామాలు నీటి ముంపునకు గురై ప్రజలు సర్వం కోల్పోయారు. అలంపూర్, రాజోలి, తుమ్మలపల్లి, పడమటి గార్లపాడు, తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, నసనూరు, ఆర్.గార్లపాడు, కూటక్కనూరు, మద్దూరు గ్రామాలు భారీగా దెబ్బతినడంతో ఈ గ్రామాల్లో పునరావసం కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు కేవలం కూటక్కనూరు, ఆర్.గార్లపాడు గ్రామాల ప్రజలకు దాతల సహకారంతో పునరావాసం కల్పించారు. అలంపూర్‌లో రక్షణగోడ పైనుంచి వరద నీరు చేరడంతో ఆలయం దాదాపు నెల రోజులపాటు నీటిలో ఉంది. పునరావాసం కల్పిస్తామని ఇచ్చిన భరోసా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

దరఖాస్తుల వెల్లువ..

అధికారులు సర్వే చేపట్టిన సమయంలో 670 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మున్సిపాలిటీ అధికారులు నిర్వాసితుల ప్లాట్లలో ఉన్న ముళ్లపొదలను తొలగించి విచారణ చేపడుతున్న సమాచారంతో ఈ పరిస్థితి నెలకొంది. కొత్త జాబితాలో మా పేర్లు లేవని ఆయా కాలనీల్లోని నిర్వాసితులు, లబ్ధిదారులు కలెక్టర్, ప్రజాప్రతినిధులకు వినతులు అందించారు. దీంతో వచ్చిన దరఖాస్తులను చూసిన అధికారులు సిద్ధం చేసిన జాబితా ప్రకారం పట్టాల పంపిణీకి వెనక్కి తగ్గారు. నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. దీంతో వరద బాధితుల సమస్య కొలిక్కి రావడం లేదు.

పంపిణీకి ప్రయత్నం చేశాం..



మున్సిపాలిటీలో వరద ముంపు నిర్వాసితులకు ప్లాట్లు పంపిణీ చేయడానికి ప్రయత్నం చేశాం. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్లాట్ల కోసం సేకరించిన స్థలంలో పెరిగిన ముళ్లపొదలను తొలగించాం. మున్సిపాలిటీ నిధుల ద్వారా దాదాపు రూ.20 లక్షలు ఖర్చుతో ప్లాట్లు సిద్ధం చేశాం. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. మా వంతుగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– మనోరమ, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

ప్లాటుగా మార్చి పట్టాలు పంపిణీ..

2009 వరద బాధితులకు పునరావాసం కల్పించడానికి అలంపూర్ మున్సిపాలిటీలో 2011లో 43.27 ఎకరాల స్థలాన్ని సేకరించారు. సేకరించిన స్థలాన్ని దాదాపు 1,425 ప్లాట్లు వేశారు. అప్పట్లోనే నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్లు నిర్మించుకోడానికి వీలుగా ఇళ్ల స్థలాలు చూపలేదు. కొనుగోలు చేసిన భూమిని ప్లాట్లుగా మార్చినప్పటికీ ఆ ప్లాట్లకు నంబర్లు ఇవ్వకపోవడంతో ఎవరి ప్లాటు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది.

నిర్మాణాలు మధ్యలోనే...!

రాజోలిలో వరద బాధితుల పునరావాసం కోసం దాదాపు 212 ఎకరాలను సేకరించారు. 3,048 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాల కోసం ప్లాట్లుగా మార్చారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో 2,175 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. 450 ఇళ్ల వరకు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. 500 వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. తూర్పుగార్లపాడులో 169 ఇళ్లు, తుమ్మిళ్లలో 499, నసనూరులో సుమారు 290 ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. చేనేత కార్మికులకు ఇళ్లతో పాటుగా మగ్గాల కోసం 750 షెడ్‌లను నిర్మిస్తామని భరోసా ఇచ్చినా.. హామీగానే మిగిలిపోయింది.

జిల్లాలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం



అయిజ: జిల్లాలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం, అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మద్యానికి సంబంధించి ఎక్సైజ్ శాఖ మంత్రి ఉన్నారు కానీ విద్యాశాఖకు మాత్రం మంత్రి లేరని ఎద్దేవా చేశారు. విద్యార్థినుల చదువు కోసం కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ద్వారా రూ.కోట్ల నిధులు కేటాయించినా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఉపయోగించుకోకుండా బాలికలకు విద్యను దూరం చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో కేజీబీవీలలో బాలికలకు సీట్లు దొరకకపోవడంతో వారు చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. తగినన్ని సీట్లు లేకపోవడంతో సీడ్ పత్తి పంట పొలాల్లో పనిచేయడానికి వెళ్తున్నారని అన్నారు.కేజీబీవీల్లో అరకొర మౌలిక వసతులు ఉండడంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యా శాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థినులకు తగినన్ని సీట్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

తనిఖీల్లో పట్టుబడిన పశువులు


పుల్లూరు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన ఎద్దులతో పోలీసులు, అధికారులు

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఫర్హాన్ ఖాన్, షేక్ నవాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం నుంచి బొలెరో వాహనంలో నాలుగు ఎద్దులు తరలిస్తున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ గౌస్, దూదేకులకు బషీర్ డీసీఎంలో 17 గేదెలను అనంతపురం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చెక్‌పోస్టు తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జడ్చర్ల: తప్పుడు కేసులు పెడతామని బెదిరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగు మందు తాగినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కొండేడుకు చెందిన నరేందర్ ఇంటికి శనివారం ఎస్సీ కులానికి చెందిన కొందరు దౌర్జన్యం చేసి తప్పుడు కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. భయపడిన నరేందర్ పురుగు మందు తాగగా వెంటనే కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా ఈవీఎం అక్రమాలు వెలుగులోకి.. ముంబైలో గెలిచిన శివసేన(షిండే) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌పై దర్యాప్తు

- ఈవీఎంల హ్యాకింగ్ సాధ్యమే.. ఏఐతో హ్యాక్ చేయవచ్చు
- వాటిని రద్దు చేయాలంటూ టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ డిమాండ్
- ఎన్ని ఆరోపణలొస్తున్నా నోరు విప్పని సీఈసీ.. కూటమి నేతలు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎంలు) పనితీరుపై ముసురుకుంటున్న అనుమానాలతో ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంతో వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చని టెక్ దిగ్గజం, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈవీఎంలను మనుషులు కూడా హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందని, అసలు వీటిని రద్దు చేయాలని చాట్ జీపీటీ నిపుణుడైన ఆయన గట్టిగా డిమాండ్ చేయడం గమనార్హం. మరోవైపు ముంబైలో గెలుపొందిన శివసేన (షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ బంధువు ఒకరు మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేసి ఆపరేట్ చేసినట్లు వెలుగులోకి రావడం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం ఈవీఎంల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓటింగ్ సరళిపై ఇప్పటికే పలువురు నిపుణులు, పరిశీలకులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా తమ ఓట్లన్నీ ఏమయ్యాయంటూ గ్రామాలకు గ్రామాలే నిలదీస్తుండటం గమనార్హం. గెలుపొందిన అభ్యర్థులు సైతం ఊహించని స్థాయిలో మెజారిటీలు రావటంపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఈవీఎంల పనితీరుపై సర్వత్రా సందేహాలు తలెత్తుతున్నా... తాము వేసిన ఓట్లు ఏమయ్యాయని ఓటర్లు ప్రశ్నిస్తున్నా.. 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయని యావత్ దేశం నిలదీస్తున్నా... కేంద్ర ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిన అనంతరం అందులో లొసుగులు గుర్తించడంతో వాటిని నిషేధించిన దేశాల సంఖ్య పెరుగుతోంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం బ్యాలెట్ పేపర్ విధానాన్నే అనుసరిస్తున్న నేపథ్యంలో మన దేశంలో ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ సరికాదని సాధారణ ఓటర్లతోపాటు నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా పరీక్షిస్తే కానీ ఈ రహస్యం వీడదని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

చిప్‌లోనే చిదంబర రహస్యం..!

ఈవీఎంలలో ఉపయోగిస్తున్న చిప్‌లపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిజ్ఞానంపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సూటిగా సమాధానం చెప్పకపోవడం సందేహాలకు బలం చేకూరుస్తోంది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని పలువురు సవాళ్లు విసురుతున్నా ఈసీ ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈసీ చేసిన ప్రకటన మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈవీఎంలలలో బ్లూటూత్ టెక్నాలజీ లాంటిది ఉండదు కాబట్టి హ్యాక్ చేయడం సాధ్యం కాదని ఈసీ ఇటీవల వరకు వాదిస్తూ వచ్చింది. అయితే ఈవీఎంలలో ప్రోగ్రామబుల్ చిప్‌లు ఉపయోగిస్తున్నామని, ఫ్లాష్ మెమరీ వాడకం కూడా ఉంటుందని ఈసీ ఇటీవల తొలిసారిగా అంగీకరించింది. ప్రోగ్రామబుల్ చిప్‌లు, ఫ్లాష్ మెమరీని హ్యాక్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఈవీఎంలు బ్లాక్ బాక్స్‌లు: ట్విట్టర్‌లో రాహుల్‌గాంధీ

ఈవీఎంలు బ్లాక్ బాక్సులు లాంటివి. వాటిని పరిశీలించేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం తీవ్ర ఆందోళనకరం.

భద్రతా సందేహాస్పదమే

ఈవీఎంల భద్రత, నిర్వహణపైనా నీలి నీడలు అలుముకుంటున్నాయి. నిపుణులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు ఈసీ సూటిగా సమాధానాలు చెప్పడం లేదు. ఈవీఎంల నిర్వహణ విషయంలో ఎన్నో భద్రత లోపాలు, ఇతర లొసుగులు ఉన్నట్లు ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైంది. 2017 డిసెంబరు నాటికే ఈవీఎంల చోరీ, ధ్వంసం ఉదంతాలు దాదాపు 70 వరకూ చోటు చేసుకున్నట్లు 'ద వైర్'ప్రచురించిన కథనం స్పష్టం చేసింది. ఉత్తరాఖండ్‌కు చెందిన మాజీ మంత్రి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈసీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈవీఎంలను తయారు చేసే ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రకటన ప్రకారం.. ఈసీఐ కోరిన దాని కంటే 1,97,368 ఈవీఎంలు, 3,55,747 కంట్రోల్ యూనిట్లు ఎక్కువగా తయారయ్యాయి. 2024 ఎన్నికల సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఈవీఎంలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద లభించాయి. ఇక చోరీకి గురైన ఈవీఎంలపై ఈసీ స్పందన విడ్డూరంగా ఉంది. ప్రతి ఈవీఎంకు ప్రత్యేకమైన ఐడీ ఉంటుందని, యంత్రం చోరీకి గురైనా, కనిపించకుండా పోయినా ఆ ఐడీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. తద్వారా ఆ ఈవీఎంలలో నమోదైన ఓట్లు పోలైన ఓట్లలో కలవకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిపింది. మరి చోరీకి గురైన యంత్రాల్లో పరికరాలను మార్చినా, ఓటింగ్ నమోదు చేసేందుకు వాడిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇతర ఈవీఎంలతో కలిపేస్తే ఏమవుతుంది? అనే ప్రశ్నలకు ఈసీ మౌనం దాల్చడం గమనార్హం.



ఈవీఎంలను నిషేధించాలి: ప్యూర్టోరికోలో ఎన్నికల అక్రమాలపై ఎక్స్‌లో ఎలాన్ మస్క్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలను నిషేధించాలి. ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ సరికాదు. వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చు. ఈ భూమ్మీద హ్యాక్ చేయలేనిది ఏదీ లేదు.

మొబైల్‌తో ఈవీఎం హ్యాకింగ్

ఈవీఎంలు ఎంత లోపభూయిష్టమో... వాటిని ఎంత సులువుగా హ్యాక్ చేయవచ్చో బహిర్గతమైంది. ముంబై నుంచి వెలువడే ప్రముఖ దినపత్రిక 'మిడ్ డే'కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని వాయువ్య ముంబై నియోజకవర్గం నుంచి ఎంపీగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించిన శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ సమీప బంధువు మంగేశ్ పండిల్కర్ తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 4న నిర్వహించారు. ఎంపీ బంధువు మంగేశ్ పండిల్కర్ ఈ సందర్భంగా తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓటీపీ జనరేట్ చేయడం ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేయడం గమనార్హం. మొదట్లో శివసేన(ఉద్ధవ్‌ఠాక్రే) అభ్యర్థి అమోల్ సంజన కీర్తికర్ కంటే వెనుకబడిన రవీంద్ర వైకర్ అనూహ్యంగా 48 ఓట్లతో విజయం సాధించడం గమనార్హం. అయితే మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేశారన్న మిడ్ డే పత్రిక కథనాన్ని ఈసీ ఖండించింది.

20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి?

దేశంలో ఏకంగా 20 లక్షల ఈవీఎంలు కనిపించకపోడం మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం 60 లక్షల ఈవీఎంలను దిగుమతి చేసుకోగా వాటిలో 40 లక్షల ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియకు కేటాయించినట్టు ఈసీ వెల్లడించింది. మరి మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయనే ప్రశ్నకు ఇటు ఈసీగానీ అటు కేంద్రంగానీ జవాబు చెప్పడం లేదు. ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో ఈవీఎంలను మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కమ్యూనిస్టు పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా విభ్రాంతి వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ, బిజూ జనతాదళ్ పార్టీలు తమకు అత్యంత బలమైన స్థానాల్లో కూడా ఓడిపోవడం విస్మయపరుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీకి ఏమాత్రం బలం లేని నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీల అభ్యర్థులకు అనూహ్య మెజార్టీలు వచ్చాయి. ఒడిశాలో బీజేపీ ఉనికి అంతంత మాత్రంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పడ్డ పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి?

- రేసులో బుద్ధప్రసాద్, బొలిశెట్టి
- ఈ నెల 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచన

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీకి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి లభించిన విషయం తెలిసిందే. 21 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని జనసేన ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. దీనికి చంద్రబాబు అంగీకరించినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు మూడో వంతు పదవులు వస్తాయని పవన్‌కళ్యాణ్ చెప్పేవారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ పదవికి జనసేన పార్టీ నుంచి అవనిగడ్డ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బుద్ధప్రసాద్ ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి జనసేనలో చేరారు. బొలిశెట్టి తొలినుంచీ జనసేనలోనే ఉన్నారు. నిజంగా అవకాశం వస్తే వీరిద్దరిలో ఒకరు ఆ పదవిలో కూర్చోవడం ఖాయమని చెబుతున్నారు. మరోవైపు స్పీకర్ పదవికి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరును పరిశీలిస్తున్నారు. ఇదిలావుండగా ఈ నెల 19వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. తొలిరోజు ప్రొటెం స్పీకర్‌తో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, రెండో రోజు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారని సమాచారం.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకరణ

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ఎ.వి.ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం సతీమణితో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆయనకు స్వామి విశిష్టతను తెలిపారు. దర్శనం అనంతరం ఈవోని వేద పండితులు ఆశీర్వదించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. దీనికిముందు సంప్రదాయాన్ని అనుసరించి ఈవో తొలిగా వరాహస్వామిని దర్శించుకుని క్యూ కాంప్లెక్స్ మీదుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో నరసింహకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రథమ ధ్యేయం

హైందవుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల అని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో మంచి పరిపాలన సాగేలా చర్యలు చేపడుతామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సంతోషంగా తిరుగుప్రయాణం అవ్వాలనే ప్రయత్నం చేస్తానన్నారు. ఆగమశాస్త్రం అనుసారం శ్రీవారి కైంకర్యాలు సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. గతంలో అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపడతామన్నారు. అలాంటి చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శ్యామలరావు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్ల వద్ద భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు.


ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న జె శ్యామలాల్‌రావు

రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలే

స్పష్టం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సాక్షి, అమరావతి: రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది. 'ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అవి. అవేమీ ప్రైవేటు ఆస్తులు కావు. అవి ఎవరి సొంతం కూడా కాదు. విశాఖ పట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించారు. వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టం. అలాంటి ప్రభుత్వ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీయించి, వాటికి వక్రీకరణలకు జోడించి బురదజల్లాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశాలేంటో ప్రజలు గమనిస్తున్నారు. 1995 నుంచి కూడా విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని చంద్రబాబు ఊదరగొడుతూనే ఉన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. విశాఖ నగరానికి ఒక ప్రధానమంత్రి వచ్చినా, ఒక రాష్ట్రపతి వచ్చినా, ముఖ్యమంత్రి వెళ్లినా, గవర్నర్‌లాంటి వ్యక్తులు వెళ్లినా వారికి ఆతిథ్యం ఇవ్వడానికి సరైన భవనమే లేదన్న విషయాన్ని గుర్తించండి. రుషికొండ రిసార్ట్స్ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీసి, పైత్యం ప్రదర్శించడంవల్ల మీకు మానసిక తృప్తి కలుగుతుందేమోగాని, విశాఖపట్నం ప్రజలకు మేలు జరగదు'అని పేర్కొంది.

జోగుళాంబ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి


స్వాగతం పలుకుతున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ఇందిరేష్‌శర్మ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు వారికి క్షేత్ర ప్రాశస్త్యం వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి కమలాపురం కవిత, ఎస్ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఉన్నారు.

గంజాయి తాగిన యువకులపై కేసు నమోదు

బిజినేపల్లి: గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు యువకులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ కనకయ్యగౌడ్ తెలిపారు. సీఐ వివరాల మేరకు.. బిజినేపల్లి మండలం గుడ్లనర్వకు చెందిన ఇద్దరు యువకులు శనివారం సిగరేట్లలో గంజాయి నింపి తాగుతుండగా.. స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, సొంత పూచీకత్తుపై ఇంటికి పంపించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన పోలీసులు.. వారి నుంచి 5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో గంజాయి, డ్రగ్స్‌పై పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల క్రితం వట్టెం శివారులో జరిగిన మహిళ హత్య కేసులో పట్టుబడిన నిందితుడు గంజాయి తాగి హత్య చేశాడని తెలుస్తోంది. కొన్నేళ్లుగా గంజాయి సరఫరా అవుతున్నా.. గంజాయి తాగే యువత వివరాలు పోలీసులకు తెలిసినా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మరో రకమైన ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉంటే, అడపాదడప పోలీసులతో రాజకీయ నాయకులకు అవసరాలు ఉండటంతో వారు నోరు మెదపలేకపోతున్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయిని నిర్మూలించేలా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా ప్రీ మాన్సూన్


కరెంట్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది


బోయపల్లి గేట్ సమీపంలో తొలగించిన చెట్ల కొమ్మలు

- ముందస్తుగా విద్యుత్ సమస్యల గుర్తింపు.. పరిష్కారానికి చర్యలు
- వర్షం, గాలి దుమారానికి ఇక్కట్లు రాకుండా ముందు జాగ్రత్త
- జిల్లావ్యాప్తంగా పనుల్లో నిమగ్నమైన విద్యుత్ శాఖ యంత్రాంగం
- మరో వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వర్షాకాలంలో వర్షం, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో తరచుగా ఎదురయ్యే సమస్యల నివారణకు విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. 'ప్రీ మాన్సూన్' పేరిట టీజీ ఎస్పీడీసీఎల్ ఆదేశాలతో జిల్లాకేంద్రంతోపాటు జిల్లావ్యాప్తంగా విద్యుత్ డివిజన్ల పరిధిలో యంత్రాంగం కార్యక్రమంలో నిమగ్నమైంది. ఈ ఏడాది మే ఆరంభం నుంచే అకాల వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం కనిపించింది. దీంతో చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు సైతం నేలకూలాయి. అంతేకాక రహదారుల వెంట చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటంతో శాఖకు రూ.లక్షల మేర నష్టం వాటిల్లడమే కాక సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో వర్షాలు పెరగనుండటంతో ఎలాంటి అంతరాయం ఎదురు కాకుండా ముందస్తు పనులు చేపడుతున్నారు.

ప్రణాళిక బద్ధంగా ముందుకు..

ప్రీ మాన్సూన్ పనులను ఈ నెల రెండో వారం వరకు పూర్తి చేయాలని విద్యుత్ యంత్రాంగం ప్రణాళిక రూపొందించుకుంది. ఇందులో ప్రధానంగా విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తిచేశారు. ఇటీవల వారం రోజులపాటు యుద్ధ ప్రాతిపదికన చెట్ల కొమ్మలను తొలగించారు. ప్రస్తుతం ఈదురుగాలులకు ఒరిగిపోయిన స్తంభాలు, వేలాడుతున్న తీగలను సరిచేయడం వంటి పనులను కొనసాగుతున్నాయి. అంతేకాక ఇన్సులేటర్ల మార్పు, కొత్త ఫ్యూజ్ బాక్సులు అమర్చడం చేస్తున్నారు. కొన్నిచోట్ల తరచుగా మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చే పనులు చురుకుగా సాగుతున్నాయి.

వారంలోగా పూర్తిచేస్తాం..



వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు పనులు చేపడుతున్నాం. జిల్లాలో శాఖ యంత్రాంగం పూర్తి స్థాయిలో ఈ పనుల్లోనే నిమగ్నమైంది. నిబంధనలకు లోబడి ఎల్‌సీ తీసుకుంటూ పనులు చేస్తున్నారు. ఈ నెల రెండో వారం వరకు పనులు పూర్తి చేసి వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నాం.

– రమేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలోని చాలాచోట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్లతోపాటు 11 కేవీ ఫీడర్ల పరిధిలో సమస్యలు ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. ఆయా సబ్‌స్టేషన్లు, ఫీడర్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రీ మాన్సూన్ పనులు చేపడుతున్నారు. సెక్షన్ ఆపరేషన్స్ ఏఈల పర్యవేక్షణలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులతో ఆయా పనులు నిర్వహిస్తున్నారు. ప్రీ మాన్సూన్‌లు మాత్రం దాదాపు నిత్యం ఏదో చోట నిర్వహిస్తూ.. ఒకేసారి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు సమాచారం ఇచ్చి పనులు చేపడుతున్నారు.

'కురుమూర్తి' చైర్మన్ రేసులో ఆశావహులు

- ఎమ్మెల్యేల చుట్టూ పలువురు ప్రదక్షిణలు
- చైర్మన్ పదవి ఎవరిని వరించునో..?

చిన్నచింతకుంట: రాష్ట్రంలోని అతి ప్రాచీన పుణ్యక్షేత్రమైన శ్రీకురుమూర్తిస్వామి ఆలయ చైర్మన్ పదవికోసం ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని సప్తగిరుల మధ్య కొలువయ్యారు స్వామివారు. అయితే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆలయ కమిటీలను రద్దు చేయడంతో నూతన పాలక మండలి ఏర్పాటు చేసేందుకు ఈ నెల 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కురుమూర్తి ఆలయ చైర్మన్ పదవి కోసం ఎంతోమంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా చిన్నచింతకుంట మండలానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మదనాపురం మండలానికి చెందిన విమల్‌కుమార్, కొకుంట్ల మండలానికి చెందిన విజయ సారథిరెడ్డి, కిషన్, రామోహన్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చైర్మన్ పద వికోసం ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సమాచారం. పాలక మండలి కమిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారికే ఎక్కువ పర్యాయాలు చైర్మన్ పదవి చేసే అవకాశం దక్కింది. ఈసారి బడుగు బలహీన వర్గాల వారికి పదవి కట్టబడితే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మొత్తం మీదగా చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని జిల్లాలో చర్చనీయాంశమైంది. కురుమూర్తి క్షేత్ర అభివృద్ధికి పాటుపడే వారికే చైర్మన్ పదవి కట్టబెడితే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.


కురుమూర్తిస్వామి ప్రధాన ఆలయం

జూరాలకు 8,649 క్యూసెక్కుల వరద

- నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 8,849 క్యూసెక్కుల వరద వస్తుండగా.. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 375 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 136, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు మొత్తం 1,476 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.531 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

రామన్‌పాడులో 1,019 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా నిలిపివేయగా.. సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

రాజోళి: ఎగువన, రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో సుంకేసుల జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. ఆదివారం 6,700 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరడంతో రెండు గేట్లు తెరిచి 6,560 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి వదిలినట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలానికి 6,560 క్యూసెక్కులు..

దోమలపెంట: సుంకేసుల నుంచి 6,560 క్యూసెక్కుల వరద ఆదివారం శ్రీశైలం జలాశయానికి చేరింది. ప్రస్తుతం జలాశయంలో 812.2 అడుగుల నీటిమట్టం, 35.6294 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయంలో 78 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

భీమా ఫేస్–1 నీటి విడుదల


నీటిలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి

కొత్తకోట/మదనాపురం: పట్టణ సమీపంలోని భీమా ఫేస్–1 పంపు హౌజ్ వద్ద ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలు చల్లి సాగునీటిని దిగువకు విడుదల చేశారు. ఎమ్మెల్యే రాకతో కొత్తకోట, మదనాపురం మండలాలకు చెందిన రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురువడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం చెరువులు, రిజర్వాయర్లు నింపేందుకు దిగువకు నీటిని వదిలామన్నారు. కాంగ్రెస్ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులతోనే నేడు ఉమ్మడి జిల్లాలోని రైతులకు సాగు, తాగునీరు అందుతుందని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మదనాపురం మండలంలోని సరళాసాగర్ లిఫ్ట్‌కు మోటారు ఆన్‌చేసి నీటిని వదిలారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.